# ఉద్యోగాల పేరుతో కోట్లు కాజేశాడు



- బ్యాంకుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మబలికిన మోసగాడు
- తక్కువ ధరకు స్థలాలు ఇప్పిస్తానని చెప్పి లక్షలు దోచుకున్నాడు
- నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చి పలువురిని మోసం
- పలు జిల్లాల్లో కేసులు నమోదు... మూడు సంవత్సరాలుగా పరారీలో
- శ్రీకాకుళం రూరల్ పోలీసుల వలలోకి అంతరాష్ట్ర నిందితుడు

**నవతరం-శ్రీకాకుళం**

బ్యాంకుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, తక్కువ ధరకు స్థలాలు కొనిపెడతానని నమ్మబలికి కోట్ల రూపాయలు మోసం చేసిన అంతరాష్ట్ర నిందితుడిని శ్రీకాకుళం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని టౌన్ డీఎస్పీ సీహెచ్. వివేకానంద మంగళవారం వెల్లడించారు.
అరెస్టయిన నిందితుడు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం ఓవ్వేరు గ్రామానికి చెందిన గొల్ల బెనర్జీ ఏ హర్షవర్ధన్ రెడ్డి (33)గా పోలీసులు గుర్తించారు.
నిందితుడు తనను ఢిల్లీలో సెంట్రల్ జోనల్ ఆడిట్ ఆఫీసర్గా పనిచేస్తున్నానని, పలు బ్యాంకుల రిక్రూట్మెంట్ బోర్డులో సభ్యుడినని చెప్పి ఎస్బీఐలో పి.ఓలు, క్లర్క్ పోస్టులు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మబలికాడు. ఒక్కో ఉద్యోగానికి రూ.6 లక్షల చొప్పున సుమారు రూ.36 లక్షలు వసూలు చేసి నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.
అదేవిధంగా శ్రీకాకుళం చిన్నబజార్ రోడ్డులో 8 సెంట్ల స్థలం తక్కువ ధరకు ఇప్పిస్తానని ఫిర్యాదుదారుడు దేశెట్టి రమణమూర్తిని నమ్మబలికి సుమారు రూ.86 లక్షలు తీసుకున్నాడు. అలాగే రూ.29 లక్షల విలువ గల గోల్డ్ క్రాఫ్ట్ యంత్రాన్ని రూ.14 లక్షలకే ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని ఎటువంటి వస్తువు ఇవ్వకుండా మోసం చేసినట్లు వెల్లడైంది.
శ్రీకాకుళంలో మోసం బయటపడిన తర్వాత విశాఖపట్నం, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో కూడా పలువురిని మోసం చేస్తూ గత మూడు సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్నట్లు దర్యాప్తులో తేలింది. సీఐడీ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన శ్రీకాకుళం రూరల్ పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్కు తరలించారు.


నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 121 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
11-03-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


# రూ. 3 కోట్లు 20 లక్షలు నిధులు మంజూరు

## రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపిన కోటబొమ్మాళి ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు, తదితరులు



**నవతరం -కోటబొమ్మాళి**

కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) భవనం ఆధునికీకరణతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో రూ. 3 కోట్లు 20 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల కోటబొమ్మాళి ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు, మార్కెట్ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంగళవారం నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ భవనాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడం వల్ల రైతులకు, వ్యాపారులకు మరింత సౌకర్యాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఛైర్మన్ చాంబర్, మీటింగ్ హాల్ నిర్మాణానికి రూ.55 లక్షలు కేటాయించగా, ప్రహరీ గోడ నిర్మాణం, గేట్ల ఏర్పాటు కోసం రూ.1.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యాలయ భవనం ఆధునికీకరణకు రూ.25 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.
చీపుర్లుపాడు వద్ద కొత్త మార్కెట్ యార్డు మంజూరు చేయడంతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధికి రూ.90 లక్షలు కేటాయించడం విశేషమని అన్నారు. మొత్తంగా రూ.3 కోట్లు 20 లక్షల నిధులు మంజూరు కావడం ద్వారా కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ మరింత బలోపేతం అవుతుందని, రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.
మార్కెట్ కమిటీల అభివృద్ధి రైతులకు ప్రత్యక్షంగా ఉపయోగపడుతుందని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, రైతులకు మెరుగైన సేవలు అందించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 12న వైఎస్ఆర్సిపి 15వ ఆవిర్భావ దినోత్సవం

## జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలి: ధర్మాన కృష్ణదాస్ పిలుపు

**నవతరం -శ్రీకాకుళం**



వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15 వసంతాలు పూర్తి చేసుకుని 16వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా.. ఈ నెల 12న (గురువారం) జిల్లావ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పండుగలా నిర్వహించాలని మాజీ ఉపముఖ్యమంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గడిచిన 15 ఏళ్లలో పార్టీ ఎన్నో సవాళ్లను అధిగమించిందని, వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో చెరగని ముద్ర వేసిందని కృష్ణదాస్ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న అప్రజాస్వామిక విధానాలు, కార్యకర్తలపై జరుగుతున్న అక్రమ దాడులను ఎదుర్కొంటూ ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ పోరాటం చేస్తోందని వివరించారు. ఈ తరుణంలో ఆవిర్భావ దినోత్సవాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామం, వార్డు, మండల మరియు నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ జెండాలను పెద్ద ఎత్తున ఎగురవేయాలి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు రంగులు వేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించాలి. పండుగ వాతావరణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువ కావాలి.
నియోజకవర్గాల వారీగా జరిగే ఈ వేడుకల వివరాలతో కేంద్ర కార్యాలయానికి పంపాలని ఆయన కోరారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ ముఖ్య నేతలు సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ధర్మాన కృష్ణదాస్ స్పష్టం చేశారు.

# 12న వైయస్సార్సీపి ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి



## వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు పిలుపు

**నవతరం -పలాస**

ప్రతినిత్యం ప్రజాపక్షంగా నిలిచే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 వసంతాలు పూర్తి చేసుకొని 16వ ఏటా అడుగుపెడుతున్న నేపథ్యంలో ..

-మిగతా 2లో

# ఎండాడలో వీసీబీ కొత్త శాఖ ప్రారంభం



2లో

ఎడిటోరియల్

# వికారం

"ఒక పసిగుడ్డు కాళ్లూ చేతులూ తెగ్గోసి వేళ్లాడదీసిన దృశ్యంకంటే ఘోరంగా, నడవలేని వృద్ధుడి పొట్టలో కత్తిదింపి పేగుల్ని బహిర్గతపరచిన దృశ్యంకన్నా దారుణంగా, పురిటినొప్పులు పడుతున్న ఒక స్త్రీపై లైంగికదాడి జరిపే కామాంధుడికన్నా వికారంగా నాకీ దేశపు వర్తమానం ఇంకా ఘోరంగా, దారుణంగా, వికారంగా కనిపిస్తుంది" అంటాడు అలిశెట్టి ప్రభాకర్. ఎప్పుడో రాసిన ఆయన మాటల్ని ఈరోజు యుద్ధ సందర్భాన మనదేశం తీసుకున్న వైఖరిని, మౌనాన్ని చూస్తుంటే సరిపోతాయని అనిపిస్తోంది. మనం ప్రత్యక్షంగా దారుణాలు, హత్యలు చేయక్కర్లేదు. ఆ దుర్మార్గాలను చూస్తూ స్పందించక, ఉదాసీనంగా, అసలు మనకేమీ సంబంధం లేనట్టు ఉండిపోవడం, అసలు నేరంకన్నా తీవ్రమైనది. దారుణమైనది. అమెరికా, ఇజ్రాయిల్ కలిసి, ఇరాన్‌పై చేస్తున్న యుద్ధ బీభత్సాన్ని, జరుగుతున్న మానవ హననాన్ని చూస్తూ మౌనంగా ఉండటం, భారతీయతత్వానికి, హృదయానికి పూర్తి వ్యతిరేకమైనది. మనదేశపు వారసత్వ సంప్రదాయానికి, ఇక్కడి ప్రజాస్పందనలకు వ్యతిరేకమైనది. ఇలా వ్యవహరించడం చాలా వికారంగానూ ఘోరంగానూ కనిపిస్తున్నది. 164మంది ప్రాథమిక పాఠశాలలో పాఠాలు చదువుతున్న చిన్నారులు ఈ ప్రపంచానికీ కొత్తగా పరిచయమవుతున్న వాళ్లు, 'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం సౌఖ్యం శేషార్థాలు, ఏమీ ఎరుగని' పులుగులు. మెరుపు మెరిస్తే వానకురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే, అది నాకే అనుకుని' మురిసిపోయే పసికందులు.. వాళ్లు తరగతి గదిలోనే ఉండగా, మంటల బాంబులు, క్షిపణులు విరుచుకుపడగా, మాంసం ముద్దలుగా ఎగిరిగోడలపైకి చిందిపడ్డ దృశ్యాలను ఎలా చూడగలము! మానవ హృదయమన్నది ఉంటే, ఎలా తట్టుకోగలదు! ఆ తల్లుల కడుపుకోతను ఈ ప్రపంచం ఓదార్చగలదా! సామాన్యులపైన, పిల్లలపైన బాంబులువేసి చంపుతున్న వాళ్లు, మేము శాంతి కోసం, న్యాయం కోసం యుద్ధం చేస్తున్నామని చెబుతున్న మాటలకు ఏమైనా అర్థం ఉన్నదా! ఇజ్రాయిల్, అమెరికా మాటలను ఇప్పటికీ తలలాడిస్తూ వింటున్న దేశాలకు, మనుషులకు, నాయకులకు కించిత్ మానవ లక్షణముంటే ఎంతబావుండు! ఇట్లాంటి ఘటన జరిగి వరుసగా పిల్లల శవాలను సమాధి చేస్తున్న చిత్రాన్ని కూడా చూసి, తానేమీ చూడనట్టు, తనకేమీ కానట్టు మౌనంగా ఉండిపోయిన 140 కోట్ల ప్రజల దేశపు ప్రతినిధిని చూస్తే నిజంగా అలిశెట్టి చెప్పినట్టు వర్తమానమంతా దారుణంగా, వికారంగా కనిపించటం లేదా! ఇంతటి నరహంతకులతో ఆలింగనాలు చేసి, ఎంతో ప్రేమను ఒలకబోసి, మేము మీకు అండగా ఉంటాము. శాంతికి సహకరిస్తామని వాగ్దానం చేసిన మన దేశ నాయకున్ని చూస్తే అసహ్యమేయటం లేదూ!
పాముకు పాలు, చీమకు పంచదారవేసి, నేలపైని సమస్త జీవుల యెడల కారుణ్యతను చూపిన నేల ఇది. సత్యము, అహింస, పరమధర్మాలుగా బోధించిన భూమి ఇది. ప్రపంచానికి ఆదర్శ మార్గాలను సూచించిన బుద్ధుడు, వర్ధమాన మహావీరుడు జన్మించిన స్థలమిది. సేవను, సహోదరత్వాన్ని బోధించిన పరమహంసలు నడయాడిన ప్రాంతమిది. సమస్త ఆలోచనలను, ఆచరణలను, సంస్కృతులను స్వీకరించిన ఈ దేశ ఔన్నత్యాన్ని ఎంత నిర్లక్ష్యంగా పాతరేస్తున్నారు నేటి నాయకులు! తమ జాతిపక్షులు చనిపోతే, అయ్యో అని పక్షులన్నీ మూగుతాయి కదా! అంతమంది పిల్లలు చనిపోతే ఒక్కమాట సంతాపం ప్రకటించడానికి నోరురాకపోవడం చూస్తే, అగ్రరాజ్య అమెరికాకు ఎంత భయపడిపోతున్నాడో ఇట్టే అర్థమైపోతుంది. మన విశాఖ పట్టణానికి నౌకా విన్యాసాలలో పాల్గొనేందుకు వచ్చిన ఇరాన్ నౌకను, తిరిగివారి దేశం వెళుతుండగా శ్రీలంక సమీపంలో హిందూ మహాసముద్రంలో అమెరికా ముంచేసి పేల్చివేస్తే కూడా కిమ్మనకుండా నోరు మూసుకుని మన దేశం ఉందంటే, స్వతంత్రతను, అన్యాయాన్ని అన్యాయమని చెప్పే ధైర్యాన్ని ఎంత కోల్పోయామో తెలుస్తున్నది కదూ!
చమురు నిల్వలు పడిపోతున్న తరుణంలో భారతదేశంపై ఎంతో కరుణతో ఒక నెల రోజులవరకు రష్యా నుండి చమురు కొనుగోలు చేసుకోవచ్చని, ఒక స్వేచ్ఛను ప్రసాదించింది అమెరికా. మనవాడు చేతులు కట్టుకునిమరీ తలూపడం ఎంత వికారమో కదా! ఇంత వెన్నెముకలేనితనమా! ఇరాన్ పర్షియా దేశం కొన్ని శతాబ్దాలుగా మనతో సంబంధాలున్న దేశమది. మిత్రదేశం కూడా సంస్కృతి పరంగా, ఆర్థికంగా కూడా ఎన్నో యేండ్ల బంధమది. అట్లాంటి దేశపు నేతను దాడిచేసి చంపితే మాట కూడా పెగలకపోవడం, విచారం ప్రకటిం చకపోవడం ఏరకమైన దౌత్యనీతి. పసిపిల్లల మరణానికీ చలించని పాషాణం నేత హృదయం!

## మాదకద్రవ్య రహిత రాష్ట్రం కోసం
# దండి యాత్ర 2.0




- వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్

నవతరం-శ్రీకాకుళం

యువతను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ జిల్లా కో ఆర్డినేటర్ కవిటి.రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమ ప్రచారంలో భాగముగా శ్రీకాకుళం విచ్చేసి స్థానిక శాసనసభ్యులు గొండు.శంకర్, పార్లమెంటరీ అధ్యక్షులు మొదలవలస.రమేష్, టీడీపీ నగర అధ్యక్షులు పాండ్రంకి.శంకర్, శ్రీకాకుళం డిఎస్పీ సిహెచ్.వివేకానంద, ఏఎస్పీలతో పాటు పలువురిని కలసి దండి యాత్ర 2.0 ప్రాముఖ్యతను తెలియజేసారు. మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు పెద్ద ప్రమాదంగా మారిందని, రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దండి మార్చ్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాత్మాగాంధీ 1930 మార్చి 12న ప్రారంభించిన చారిత్రాత్మక దండి యాత్ర స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 నియోజకవర్గాల్లో 10 లక్షల మంది యువతతో పాదయాత్రలు నిర్వహించి మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తామని, జిల్లావ్యాప్తంగా 12వ తేదీన జరిగే దండి మార్చ్ 2.0 కార్యక్రమానికి సంబంధించిన 100 అడుగుల జాతీయ జెండాలు..12 వేల ప్లేడ్జీలు, బ్యానర్లు, 06నియోజకవర్గాలకు పంపించడం జరిగిందన్నారు.
విజయవాడలోని ఎంజి రోడ్ లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2.4కెఎం పాల్గొంటారన్నారు. కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, యువతలో మాదకద్రవ్యాలపై చైతన్యం పెంచే కార్యక్రమాలు తీసుకుంటున్నామని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ కోఆర్డినేటర్ దేవకన్య, ఆమదాలవలస కోఆర్డినేటర్ చిరంజీవి, టీడీపీ సీనియర్ నాయకులు మాదారపు.వెంకటేష్, ఎస్సి సెల్ ప్రెసిడెంట్ బాలమని, అంధవరపు.ప్రసాద్, టీడీపీ నగర మహిళా అధ్యక్షురాలు మాధవి తదితరులున్నారు.

## పేద వర్గాలను ఆదుకుంటున్న
# కూటమి ప్రభుత్వం



- ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- రాజకీయాలకు అతీ తంగా సీఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం
- మంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

నవతరం -శ్రీకాకుళం

రాజకీయాలకు అతీతంగా ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా పేద వర్గాలను కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం వివిధ అనారోగ్య కారణంగా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులకు 9 మంది లబ్ధిదారులకు రూ. ఏడు లక్షల 50 వేలు లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఆశయంతో నా వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో వైద్యసహాయం అందజేయడం జరుగతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధి దారులు వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబునాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన మంత్రి వర్యులకు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సహాయం పొందిన రోగుల ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

**లబ్ధిదారుల వివరాలు**
బి,వరదరాజు, 77,090, మండలం కోటబొమ్మాళి, చిన్నసాన, పి.మల్లేశ్వరరావు, కోటబొమ్మాళి మండలం, రూ, 51.245, కె.అప్పారావు, కోటబొమ్మాళి, పట్టుపురం, రూ,32,551 టి,సింహబాలుడు, కోటబొమ్మాళి, తాటిపత్రి, నీటవేణ నందిగాం మండలం కోత్తపేట, 41,729. ఎన్. శ్రీరాములు, సంతబోమ్మాళి వడ్డివాడ, రూ. 31,843 కె.సర్వతి, పుక్కలవానిపేట, రూ. 60,848, ఎల్,శ్రీనివాసరావు, వద్దవాడ, సంతబొమ్మాళి, బృందావనం 1,12,141, చెక్కులు అందజేశారు.

# ఎండాడలో వీసీబీ కొత్త శాఖ ప్రారంభం

నవతరం -విశాఖపట్నం

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు 60వ శాఖను విశాఖపట్నంలో ఎండాడ ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉదయం ప్రారంబించారు. బ్యాంకు ఛైర్మన్ జే.వి.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో జిల్లా సహకారాధికారి టి ప్రవీణ , సుప్రసిద్ధ సహకారవేత్త బ్యాంకు మార్గదర్శకులు మానం ఆంజనేయులు,సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు పి.ఆర్.వి.పి.ఎస్. రంగరాజు,ఏపీ కోఆపరేటివ్ బ్యాంకులు,సహకార సంఘాల ఫెడరేషన్ డైరెక్టర్, ఏపి టఫ్కబ్ సభ్యులు ఎం వెంకటరత్నం , శ్రీ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు,మహారాజా కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎం.అర్.కే రాజు హాజరై తమ సందేశాలను అందించారు.
బ్యాంకు ఛైర్మన్ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ,ఈ బ్రాంచి ద్వారా రానున్న 5 సంవత్సరాల కాలంలో 100 కోట్ల రూపాయల ఋణాలు జారీచేయగలమని ఆశిస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు వీరగంట చంద్రశేఖర,జనార్ధన రావు,ఆదినారాయణ శాస్త్రి, ప్రసాద రావు,పార్వతి దేవి, కోటేశ్వర రావు, నారాయణస్వామి,డా. కృష్ణమోహన రావు,చుక్కపల్లి రామారావు,ఆచార్య అంజయ్య, నరసింహ మూర్తి, మల్లికార్జునరావు,శ్రీకాంతబాబు, సి.ఆర్.సుకుమార్, ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి.బి.వరలక్ష్మీ, పెద్ద సంఖ్యలో సభ్యులు, ఖాతాదారులు , సిబ్బంది పాల్గొన్నారు.

# జాతి సమగ్రతకు సర్దార్ పటేల్ ఆలోచనలే అనుచరణీయం

నవతరం -ఎచ్చెర్ల





దేశ ఉమ్మడి గుర్తింపునకు, జాతి సమైక్యతకు మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆలోచనలు, ఆశయాలు ఎన్నటికీ అనుచరణీయమని వక్తలు అభిప్రాయపడ్డారు. భారత-భారతి(కేంద్ర సాంస్కృతిక శాఖ), డా. బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో 'ఎక్ భారత్-శ్రేష్ఠ భారత్'లో సమాజ ఐక్యత, జాతి నిర్మాణం, పటేల్ దార్శనికత అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమంను మంగళవారం వర్శిటీలో నిర్వహించారు. అదేవిధంగా సర్దార్ పటేల్ 150వ జయంతోత్సవాలు, వందేమాతరం 150 మహోత్సవాలు కూడా జరిపారు. ఈ కార్యక్రమంలో కీలకోపన్యాసం చేసిన భారత-భారతి దక్షిణ భారత ప్రభారి డా. మీనాక్షి పద్మనాభాన్ మాట్లాడుతూ భిన్నమైన సంస్కృతులు, విభిన్నమైన ఆచారాలు గల భారత్ లో సాంస్కృతిక బంధాలు పెరిగేందుకు, భిన్నత్వంలో ఏకత్వాన్ని బలోపేతం చేయడానికి ఎక్ భారత్-శ్రేష్ఠ భారత్ మార్గం ఎంతో ప్రయోజనకరమన్నారు. జాతీయ సమైక్యత వ్యాప్తికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాది పటేల్ జయింతి రోజున దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. వర్శిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని మాట్లాడుతూ సర్ధార్ పటేల్ దార్శనికతే నేటి సమగ్ర జాతీయ ఐక్యతకు నిదర్శనమన్నారు. సాంస్కృతిక మార్పిడి, సమగ్రతకు ప్రతి ఒక్కరు పాటు పడాలని సూచించారు. రీసోర్స్ పర్సన్ గా పాల్గొన్న రాష్ట్రీయ సంఘటన మంత్రి, భారత-భారతి కె. జగన్నాథ్ మాట్లాడుతూ కాలతీత రాజనీతిజ్ఞుడు, భారత ఐక్యత పితామహుడు సర్ధార్ వటేల్ అని కొనియాడారు. ఆయన సిద్ధాంతాలు ఎన్నటికీ దేశసమైక్యతకు అవసరమన్నారు.

# 12న వైయస్సార్సీపి ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఈనెల 12వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా పండగ వలె పలాస నియోజకవర్గం లో నిర్వహించి విజయవంతం చేయాలని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విలువలు.. విశ్వసనీయతే వైఎస్ఆర్సిపి పార్టీ మూల స్తంభాలని, సంక్షేమం.. అభివృద్ధి పార్టీ సిద్ధాంతాలని, ప్రజా పక్షమై పోరాటాలు చేయాలన్నా.. ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలన్నా వైయస్సార్సీపి తోనే సాధ్యమన్నారు. ప్రజా ఆకాంక్షల మేరకు ప్రజల గుండెల్లో ఆవిర్భవించిన పార్టీ 15 ఏళ్లలో ఎన్నో సవాళ్లను అధిగమించింది అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైయస్సార్సీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న అక్రమ దాడులను ఎదుర్కొంటూ ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేస్తుందని బమ్మిడి దుర్యోధన వివరించారు. ఈ నేపథ్యంలో వైయస్సార్సీపి ఆవిర్భావ దినోత్సవాన్ని స్ఫూర్తిదాయంగా నిర్వహించాలన్నారు. పలాస నియోజకవర్గం లో రాష్ట్ర మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేర ప్రతి గ్రామం, వార్డు, మండల, పట్టణ, నియోజకవర్గ కేంద్రాల లో పార్టీ జెండాలను పెద్ద ఎత్తున ఎగరవేయాలి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు రంగులు వేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించాలన్నారు. పండుగ వాతావరణం లో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు చేరువ కావాలన్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైయస్ఆర్సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని బమ్మిడి దుర్యోధనరావు స్పష్టం చేశారు.

# నిజమైన గౌరవం



మగవాడికి వందనం... మనసారా వందనం
కుటుంబానికి అండగా నిలిచే అతనికి వందనం
మహిళను గౌరవించే మంచి మనసుకు వందనం
మన ఇంటి ఆనందమైన అతని ప్రేమకు వందనం

పగలు రాత్రి కష్టపడే మంచి మనసున్న వాడు
కుటుంబం కోసం ఎప్పుడూ శ్రమించే వాడు
తన బాధలను బయట చెప్పకుండా
అందరి సంతోషం కోసం జీవించే వాడు

తండ్రిగా పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడతాడు
వారి చదువు కోసం ఎప్పుడూ ఆలోచిస్తాడు
పిల్లలు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ
తన కష్టాన్ని కూడా నవ్వుతూ భరిస్తాడు

ఇంట్లో అందరి అవసరాలు తీర్చే వాడు
కుటుంబం సంతోషంగా ఉండాలని కోరుకునే వాడు
తన కలలకన్నా వారి కలలను ముందుకు పెడతాడు
బాధ్యతతో కుటుంబాన్ని నడిపించే వాడు

మహిళను గౌరవించి కుటుంబాన్ని కాపాడే
ప్రతి మగవాడికి మన వందనం
మన హృదయం నుంచి వచ్చే
నిజమైన గౌరవం మరియు నమస్కారం

**రచన-తేరాల రాజేంద్ర ప్రసాద్**
రత్న లహరి ఛానల్ సీఈవో 9297109223 సికింద్రాబాద్

# చిత్రలేఖన పోటీల్లో కంచిలి గురుకులం విద్యార్థుల ప్రతిభ

**-25 మందికి స్వర్ణ పథకాలు - ఇద్దరికి వెండి పథకాలు**
**-35 మందికి మెరిట్ సర్టిఫికెట్లు - ఆర్ట్ ఉపాధ్యాయుడికి అవార్డు**





**నవతరం -కంచిలి**

కంచిలిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు) విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మార్చి 28న నిర్వహించనున్న 13వ ఆల్ ఇండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటీషన్ కం ఎగ్జిబిషన్‌లో ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొననున్నారు.
ఈ పోటీలకు పాఠశాల నుంచి పంపిన చిత్రలేఖనాల్లో 25 మంది విద్యార్థులు స్వర్ణ పథకాలు, ఇద్దరు విద్యార్థులు వెండి పథకాలు, 35 మంది మెరిట్ సర్టిఫికెట్లు పొందారు.
ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన విద్యార్థుల అసెంబ్లీలో వారికి పథకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చిన ఆర్ట్ ఉపాధ్యాయుడు డిక్కల మన్మధరావుకు డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్ట్, విజయవాడ నుంచి ఉత్తమ ఆర్ట్ ఉపాధ్యాయుడిగా అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులు మరియు ఆర్ట్ ఉపాధ్యాయుడిని అభినందించారు.

# ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి

**అదనపు ఎస్పీ కేవీ.రమణ**



**నవతరం -శ్రీకాకుళం రూరల్**

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని, వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచాలని అదనపు ఎస్పీ కేవీ. రమణ అన్నారు.ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు 14 రోజుల పాటు నిర్వహించిన పున:శ్చరణ శిక్షణ (మొబిలైజేషన్) ముగింపు కార్యక్రమం మంగళవారం ఉదయం తండేవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం పరేడ్ మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ కేవీ.రమణ హాజరై మాట్లాడుతూ, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు రోజూ నిర్వహించే వివిధ విధులు, ఆయుధాల వినియోగం వంటి అంశాలను ఈ మొబిలైజేషన్ శిక్షణలో భాగంగా పున:శ్చరణ చేయడంతో పాటు వాటికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కూడా జోడించామని తెలిపారు. జిల్లా పోలీసు శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం ఎంతో ముఖ్యమైనదని, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు శాఖకు వెన్నెముకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు ప్రతిరోజూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తగిన ఆహారం తీసుకుంటూ శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆయన తెలిపారు.
ఈ మొబలైజేషన్ (పునశ్చరణ) శిక్షణలో వీఐపీల భద్రత, ఫైరింగ్, మాబ్ ఆపరేషన్, వ్యక్తిత్వ వికాసం, మస్కట్రీ డ్రిల్, మెడికల్ అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం, రయట్ గేర్ ఆపరేషన్, యోగ, శారీరక దారుఢ్య పరీక్షలు వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ ద్వారా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు తమ వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకుని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శేషాద్రి, గోవిందరావు, ఆర్ఐ శంకర్ ప్రసాద్, ఆర్ఎస్ఐలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సెట్ లో అయినా, ఇంట్లో అయినా.. గౌరవం ఇవ్వాల్సిందే!

సెట్ లో అయినా, ఇంట్లో అయినా.. గౌరవం ఇవ్వాల్సిందే! టాలీవుడ్‌లో మహిళా డైరెక్టర్ల సంఖ్య ఇంకా తక్కువగా ఉన్నప్పటికీ, నటి వరలక్ష్మి శరత్‌కుమార్ తనదైన ముద్ర వేయాలని డైరెక్టర్ గా కొత్త అడుగు వేస్తున్నారు. ఆమె దర్శకత్వంలో రూపొందిన సరస్వతి సినిమా మార్చి 6న రిలీజ్ కావడానికి సిద్ధమవుతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రాగా, ఈ చిత్ర ప్రమోషన్స్ లో వరూ యాక్టివ్ గా పాల్గొంటున్నారు. ఆ సినిమా నుంచి తప్పుకున్నా!
అహం, ఆత్మగౌరవంలో తాను ఆత్మ గౌరవానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తానని, ఓ మలయాళ మూవీలో తనను తక్కువగా చూశారని ఆ సినిమా నుంచి తాను తప్పుకున్నట్టు ఆమె వెల్లడించారు. ఆ సినిమా హీరో, డైరెక్టర్ మంచి వాళ్లైనప్పటికీ, నిర్మాత తనతో వ్యవహరించిన తీరు నచ్చకపోవడంతో, హీరోకు కాల్ చేసి ఈ సినిమాను చేయడం లేదని చెప్పానని, అది అహంభావం కాదని, ఆత్మ గౌరవమని ఆమె తెలిపారు. అందరితో నిజాయితీగా ఉంటా! తాను అందరితో నిజాయితీగా ఉంటానని, తాను అందరినీ గౌరవిస్తానని, తనను కూడా అందరూ గౌరవించాలని కోరుకుంటానని, సెట్ లో అయినా, ఇంట్లో అయినా ఎక్కడైనా గౌరవం ఇవ్వాల్సిందేనని, లేదంటే అస్సలు సహించనని ఆమె పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తల్ని తాను పెద్దగా పట్టించుకోనని చెప్తున్న ఆమె, సోషల్ మీడియాలో వచ్చిన ఓ వార్తను చూసి తాను తెగ నవ్వుకున్నానని తెలిపారు. అదే ఉంటే ఇక్కడెందుకు ఉంటా? తన పెళ్లికి రూ.800 కోట్లు ఖర్చైందని సోషల్ మీడియాలో వార్తలొచ్చాయని, అంత డబ్బే తన దగ్గరుంటే అసలు ఇక్కడ ఎందుకు ఉంటానని అడిగారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా గురించి కూడా ఆమె మాట్లాడారు. సోషల్ మీడియా కాలక్షేపానికి పనికొస్తుందని, దానిపై ఎక్కువ టైమ్ వేస్ట్ చేయకుండా, క్రియేటివ్ గా ఆలోచిస్తే, అది కెరీర్ కు ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. ఫహద్ ఫాసిల్, ఆలియా భట్, మంజు వారియర్, దీపికా పదుకొణె ను తానెంతో అభిమానిస్తానని చెప్తున్న వరలక్ష్మి, నాంది మూవీలో ఆద్య క్యారెక్టర్ అంటే చాలా ఇష్టమని, అది యాక్టింగ్ పరంగా చాలా గొప్ప పాత్ర అని చెప్పుకొచ్చారు. సరస్వతి సినిమా అన్ని వర్గాల ఆడియన్స్ ను ఆకట్టుకుంటుందని, ఈ సినిమా తీసినందుకు తనకు గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు.




# పెద్ది సినిమా రన్‌టైమ్‌పై క్లారిటీ



పెద్ద సినిమాలు భారీ రన్‌టైమ్‌తో రావడం కామన్ అయిపోయింది. యానిమల్ సినిమా రన్ టైమ్ చూసి ముక్కునవేలేసుకున్నారు జనం. అంతకుమించిన నిడివితో ధురంధర్-2 వస్తోంది. ఇదే క్రమంలో పెద్ది సినిమా కూడా భారీ రన్‌టైమ్‌తో వస్తోందనే ప్రచారం మొదలైంది.
ఈ సినిమా టోటల్ ఫూటేజ్ 4 గంటలపైనే ఉందని, ఫైనల్ ఫూటేజ్ 3 గంటలకు పైనే ఉంటుందనే ప్రచారం మొదలైంది. దీనిపై చాలామంది చాలా రకాలుగా కథనాలు ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో యూనిట్ అప్రమత్తమైంది.
పెద్ది సినిమా ఫైనల్ రన్‌టైమ్‌పై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని పెద్ది యూనిట్ విజ్ఞప్తి చేసింది. కేవలం తొలి సగం మాత్రమే లాక్ అయిందని క్లారిటీ ఇచ్చింది. సెకండాఫ్‌కు సంబంధించి ఇంకా షూటింగ్ నడుస్తోందని స్పష్టం చేసింది.
మరోవైపు పెద్ది సెకెండ్ సాంగ్‌పై జోరుగా చర్చ సాగుతోంది. చరణ్ డాన్స్‌ను చిరంజీవి ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. దీనిపై దర్శకుడు బుచ్చిబాబు స్పందించాడు. ఆ డాన్స్ చేస్తున్నప్పుడు చరణ్ తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నారని, షూట్ ఆపుదామని చెప్పినా వినకుండా, జ్వరంతో డాన్స్ చేశారని గుర్తుచేసుకున్నాడు. ప్రస్తుతం రయ్...రయ్..రారా సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

## అల్ ఇండియా టైక్వాండో పోటీలకు జాస్వీక ఎంపిక. కోచ్ నర్సిపురం శేఖర్



**నవతరం టెక్కలి**

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో గల కోడి రామ్ మూర్తి స్టేడియం లో ఈరోజు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మహిళా టైక్వాండో ఎంపిక జరిగింది. ఈ పోటిల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం కు చెందిన పులిబంద జాస్వీక ఉత్తమ ప్రతిభ కనపర్చి అల్ ఇండియా యూనివార్సిటీ టైక్వాండో పోటీలకు 57కేజీల మహిళా విభాగం లో పాల్గొంటుంది అని శిక్షకులు నర్సిపురం శేఖర్ తెలిపారు, ఈ పోటీలు ఒడిస్సా రాష్ట్ర బాలాసార్ పట్టణం లో గల ఫకీర్ మోహన్ యూనివర్సిటీ లో ఈ నెల 16,17,18,19, 20 తేదీల్లో జరుగుతాయిఅని,ఈ ఎంపిక పట్ల జిల్లా క్రీడా అధికారి డి ఎస్ డివో మహేష్ బాబు అభినందనలు తెలియజేశారు.

## పరువు హత్య కేసులో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి




**నవతరం-శ్రీకాకుళం**

**– హంతకులకు కఠినంగా శిక్షించాలి**

**– అఖిల గాండ్ల తెలుకల సంక్షేమ సంఘం డిమాండ్**

తమ కులం కాని వాడిని తమ అక్క చెల్లెలు ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారనే కారణంతో కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి కి చెందిన పోలిపల్లి వీర వెంకట సూర్య ప్రకాశరావు ను కిరాతకంగా పరువు హత్య చేసిన అయినవిల్లి చంద్రపాల్, గిరిబాబు లను కఠినంగా శిక్షించాలని అఖిల గాండ్ల తెలుకల సంక్షేమ సంఘం శ్రీకాకుళం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీకాకుళం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమనాపల్లి లక్ష్మణ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జ్ఞానమూర్తి మాట్లాడుతూ, రేపటి కుల రహిత సమాజం ఆవిష్కృతం అవుతున్న ఈ సంధి యుగంలో తమ కులం కాని వాడిని ప్రేమించి పెళ్లి చూసుకోవడం రుచించని కుటుంబ సభ్యులు అతికిరాతంగా పెళ్లి కుమారుడిని హత్య చేయడం తీరు చూస్తే.. పరువు హత్యలు మానవతకు అవమానం అన్నారు. దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి సుమారు 7 దశాబ్దాలు పైగా గడిచినప్పటికీ, సమానత్వం, సమన్యాయం, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి సామాజిక అంశాలలో భాగంగా ఆర్టికల్ 21 ద్వారా స్వతంత్రంగా జీవించే హక్కు కలిగి ఉన్నప్పటికీ, పరువు హత్య పాత బుద్ధుల సమాజానికి శిధిల అవశేషాలుగా హంతకులు మిగిలిపోతున్నారని విమర్శించారు. పురాతన ఆచార సాంప్రదాయాలు మానవాళిని అభివృద్ధి పథంలో నడిపించేలా ఉండాలని, కానీ సాంప్రదాయాలు చుట్టూ అవివేకంగా పరిభ్రమించాలా ఉండకూడదని, పరువు హత్యకు వ్యతిరేకంగా అందరూ గళం విప్పాలన్నారు. హత్య కావించబడిన పోలిపల్లి వీర వెంకట సూర్య ప్రకాశరావు కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. అలాగే కిరాతనంగా హత్య చేసిన అయినవిల్లి చంద్రపాల్, గిరిబాబులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కొమనాపల్లి లక్ష్మణ ప్రసాద్, దాసరి జ్ఞానమూర్తి లు డిమాండ్ చేశారు.

## క్రికెట్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ.10 వేలు ఆర్థిక సహాయం



వైసిపి ఇన్చార్జ్ తిలక్

**నవతరం టెక్కలి**

నేడు సంతబొమ్మాలి మండలం పాత మేఘవరం క్రికెట్ గ్రౌండ్ క్రీడా మైదానం అభివృద్ధి కొరకు వైయస్సార్ సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ 10 పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పాత మేఘవరం గ్రామానికి చెందిన యువకులకు టెక్కలి తమ పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు విద్యతో సహా క్రీడలు కూడా అత్యంత అవసరమని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సాహుకారి వసంత్, గాడి గణేష్, జోగారావు, జి.వాసు ఎన్.లక్ష్మణరావు, బి.లక్ష్మణరావు, బి.శివ, ఎస్ కృష్ణ బి.తేజ, ఎస్.సాయి, సిహెచ్.శంకర్ పూజరావు, ఎన్.ఉమా , తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం “సమం దానం”

**– లయన్ పొన్నాడ.రోషిణి**

**నవతరం-శ్రీకాకుళం**



అన్నదానం సమం దానమాని, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమదాలవలస కోశాధికారి లయన్ పొన్నాడ.రోషిణి అన్నారు. విశ్వ హిందూ పరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్విరామముగా కొనసాగుతున్న అన్నసమారాధనలో జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ.రవి కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొని, పేదలకు అనప్రసాదాన్ని అందించారు. అనంతరం పొన్నాడ రవి కుమార్ మాట్లాడుతూ అన్నదానమునకు సరియైన దానం త్రిలోకాలలో కూడా చూడలేమని, స్వీకరించిన వారు తృప్తిని పొందుతారన్నారు. అన్నదానం చేసిన వ్యక్తి తెలిసి తెలియక చేసిన గత జన్మలోని పాప సంచయాన్ని కూడా అన్నదానం తొలగిస్తుంది అని మన ప్రగాఢ విశ్వాసమని, అందుకే మన హిందూ ధర్మములో అన్నదానానికి అంతటి ప్రాధాన్యత ఉన్నదన్నారు. లయన్ పొన్నాడ.రోషిణి మాట్లాడుతూ విశ్వ హిందూ పరిషత్ శ్రీకాకుళం జిల్లా ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని పేదలకు అందించటం గొప్ప విషయమన్నారు. నిర్వాహకులు విశ్వ హిందూ పరిషత్ శ్రీకాకుళం జిల్లా మధుసూదన్ గురుస్వామి మాట్లాడుతూ తోటపాలేం జంక్షన్ విశ్వ హిందూ పరిషత్ కార్యాలయ ఆవరణలోఈరోజు 31వ మంగళవారం 200 మందికి అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగిందని, రాగోలు గ్రామం వాస్తవ్యులు శ్రీకాకుళం జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ కుమార్తె, పొన్నాడ రోషిణి జన్మదినం శుభ సందర్భంగా ఈరోజు జరిగిన అన్న సమారాధన కార్యక్రమానికి సహాయసహకారాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ సేవా కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సిందూర, మెంటార్ నటుకుల మోహన్, లయన్స్ సభ్యులు పొడుగు చరణ్, రామం, మరియు తెలుగుదేశం జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్, తెలుగుదేశం నాయకులు మొదలవలస చంద్ర హర్ష, విశ్వ హిందూ పరిషద్ వైస్ ప్రెసిడెంట్ ఆచారి పాల్గొన్నారు



## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శంకరం ఫౌండేషన్ చే పోలయ్య కవి కూకట్లపల్లికి ఘనసన్మానం






**హైదరాబాద్ :బాగ్ లింగంపల్లి**

శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం శంకరం ఫౌండేషన్ భారత సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం కవిసమ్మేళనం సభ ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా డా.రాధా కుసుమ సమన్వయ కర్తగా ఏర్పాటు చేసిన కవిసమ్మేళనంలో హైదరాబాద్ నివాసి ప్రముఖ కవి రచయిత నటుడు పోలయ్య కవి కూకట్లపల్లి పాల్గొని

“ఓ నవభారత నారీమణి నీకు వందనం..
“అభివందనం” శీర్షికన”
“నిన్న నీవు ఒక ఆడపిల్లవు...
“నేడు అగ్గి పుల్లవు...
“నిన్న నీవు కమ్మని కలవు
“నేడు అందమైన అలవు...
“నిన్న నీవు పెరట్లో తులసి మొక్కవు
“నేడు గర్భం దాల్చిన గంధపు చెక్కవు...
“నిన్న గుట్టుగా కాపురం చేసే గృహిణివి
“నేడు సామ్రాజ్యాన్నేలే బిజినెస్ మాగ్నెట్ వి...
“నిన్న నీవు అబలవు
“నేడు అగ్నిశిఖవు ఆదిపరాశక్తివి...
“ఓ మహిళా మణిదీపమా..!
“నీకిదే నా వందనం అభివందనం” అంటూ స్త్రీ ఔన్నత్యాన్ని చాటే చక్కని కవితను గానం చేసిన పోలయ్య కవి కూకట్లపల్లిని శంకరం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు యలపర్తి ధనలక్ష్మీ గజల్ క్వీన్ వాసిరెడ్డి మల్లేశ్వరి ఘనంగా సన్మానించారు

ఈ సభలో జస్టిస్ బి.చంద్రకుమార్ రచించిన నాలుగు పుస్తకాలను జస్టిస్. టి. రజని ఆవిష్కరించారు.డా. కోగంటిఉషారాణి... అలేఖ్య...డా. రాధాకుసుమ పుస్తక సమీక్ష చేశారు ఈ సభలో ఆత్మీయ అతిథులుగా.... డా.జల్దీ విద్యాధర్...డా.రఘు అరికపూడి మరియు డా.విజయలక్ష్మి పండిట్.. గజల్ క్వీన్ వాసిరెడ్డి మల్లేశ్వరి యమునా పాఠక్ తదితర మహిళామూర్తులు హాజరై స్త్రీ సాధికారతపై చక్కని ఉపన్యాసాలు ఇచ్చారు. తదనంతరం అతిథులకు వివిధ సాహిత్య సేవ కళా రంగాలలో విశిష్ట సేవలనందించిన కళాకారులను మహిళా మణులను కీర్తిస్తూ కమ్మగా కవితాగానం చేసిన కవులను కవయిత్రులను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శంకరం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు యలపర్తి ధనలక్ష్మీ డా.బిక్కి కృష్ణ ఘనంగా సన్మానించారు.

## బుధవారం రెరా చట్టంపై అవగాహన సదస్సు

**నవతరం -శ్రీకాకుళం**

రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, బాధ్యత మరియు వినియోగదారుల హక్కుల పరిరక్షణను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ఆధ్వర్యంలో రెరా చట్టం, 2016 నిబంధనలు, వాటి అమలు విధానం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ రెరా చైర్మన్ ఆరె శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ అవగాహనా కార్యక్రమం ఈ నెల 11వ తేది బుధవారం ఉదయం 10.00 గంటల నుండి విజయనగరం లోని హోటల్ ఎస్‌విఎన్ లేక్ ప్యాలస్ లో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాలకు చెందిన రియల్ ఎస్టేట్ రంగ ప్రమోటర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మరియు గృహ కొనుగోలుదారుల కోసం ఏర్పాటు చేసిన ఈ అవగాహన సదస్సు ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రెరా చట్టం–2016లోని ముఖ్య నిబంధనలు, ప్రాజెక్టుల నమోదు విధానం, సమయపాలన, ఆర్థిక పారదర్శకత, వినియోగదారుల హక్కులు మరియు బాధ్యతలు తదితర అంశాలపై రెరా చైర్మన్ తో పాటు రెరా డైరెక్టర్ జివిజిఎస్ వరప్రసాద్, రెరా సభ్యులు పాల్గొని సమగ్రంగా వివరించనున్నట్లు ఆయన తెలిపారు.

విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రమోటర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మరియు గృహ కొనుగోలుదారులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని రెరా చట్టంపై అవగాహన పొందాలని ఏపీ రెరా చైర్మన్ ఆరె శివారెడ్డి విజ్ఞప్తి చేశారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**